సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 18 । జూలై । 2025



నియామకం

మద్దిలపాలెం: ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతిగా ఆచార్య డి.సింహాచలంను నియమించారు. రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు జరిగాయి. నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.



యువకుడు బలి

కాంక్రీట్ టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. సకాలంలో ఆస్పత్రికి తరలించి ఉంటే ప్రాణం నిలిచేది.

8లో

న్యూస్‌రీల్

జీవీఎంసీకి స్వచ్ఛ పురస్కార్

సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం



అవార్డు అందుకుంటున్న మేయర్ శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: స్వచ్ఛభారత్ మిషన్ 2.0లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2024కు గానూ జీవీఎంసీ జాతీయ స్థాయి స్వచ్ఛ పురస్కారాన్ని దక్కించుకుంది. సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్–2024 అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా మేయర్ పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌తో కలిసి ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రత్యేక కేటగిరీలో జీవీఎంసీ ప్రథమ స్థానం సాధించడం విశాఖ నగరానికి ఎంతో గౌరవమన్నారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో స్వచ్ఛ సర్వేక్షణ్–2025లో కూడా జీవీఎంసీ ఉత్తమ పరిశుభ్ర నగరంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలులో ప్రతిభ



అనకాపల్లి సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రమేష్‌ను సత్కరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లాలో వివిధ గంజాయి, ఇతర కేసుల్లో నాన్ బెయిలబుల్ వారెంట్లను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం, ఇతర రాష్ట్రాల్లోని నిందితులను గుర్తించి తీసుకురావడంలో జిల్లా పోలీసుల కృషి అభినందనీయమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. నాన్ బెయిలయిల్ వారెంట్ల అమలులో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందితో ఆయన గురువారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నాన్ బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేయడం వల్ల చట్టపరమైన చర్యలు వేగవంతం కావడం, నిందితులను కోర్టు ముందు హాజరుపరచడం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ ఎస్.లక్ష్మణమూర్తి, వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు పి.రమేష్, బి.రామకృష్ణ, డి.నాగేంద్ర, ఐటీ కోర్ టెక్నికల్ సపోర్ట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

తుమ్మపాల: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఏఎంపీ పథకం ద్వారా ఉచితంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.కె.పి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి, ప్రాజెక్టు తయారీ విధానం, ప్రభుత్వ పథకాలు, మార్కెట్‌పై అవగాహన కల్పిస్తూ 20 రోజుల శిక్షణతో గుర్తింపు గల సర్టిఫికెట్ మంజూరు చేస్తామన్నారు. 18 నుంచి 58 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని ఈ నెల 19న ఉదయం 10 గంటలకు మన్నా స్కూల్ (పాయకరావుపేట), తుపాను బిల్డింగ్ (రాంబిల్లి), కమ్యూనిటీ సెంటర్ (ఎస్సీ కాలనీ అనకపల్లి), సత్యం కంప్యూటర్ సెంటర్ (చోడవరం) వద్ద ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో హాజరు కావాలన్నారు. ఈ నెల 21 నుంచి మొదటి బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు ఫోన్ నెం.9951447776, 6305128811 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ ఫైనల్ కౌన్సెలింగ్ ప్రారంభం

మురళీనగర్ (విశాఖ): పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆఖరి దశ కౌన్సెలింగ్ గురువారం ప్రారంభమైంది. ఇంత వరకు సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోని వారు ఆన్‌లైన్ ద్వారా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇనిస్టిట్యూట్, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీల్లో శుక్రవారం అన్ని ర్యాంకుల వారికి సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. ఈనెల 21వ తేదీన సీట్లు కేటాయిస్తారు. 24వ తేదీ నుంచి 26 వరకు సెల్ఫ్ రిపోర్టింగు చేసుకోవచ్చు.

నేను పీలా గోవిందును మాట్లాడుతున్నాను బ్రదర్. వెంగమాంబ క్రషర్‌లో నేను ఒన్ ఆఫ్ ది షేర్ హోల్డర్. దాని జోలికి వెళ్లక. ఎప్పటి నుంచో ఉంది. వాళ్ల ఫాదర్.... మా ఫాదర్ పార్ట్‌నర్స్. తెలియకపోతే తెలుసుకో. మన ఫ్యామిలీది అది. పర్మిషన్ లేనివి వంద ఉన్నాయి. నాది అనేటప్పుడు గొడవ పడతవు. పడు. నా మీద గౌరవం ఉంటే వదిలేయ్...

ఇవి స్వయంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు!!

• నిస్సిగ్గుగా...‘పీలా’పన

ఆ క్రషర్ మనదే... వదిలెయ్..!

వెంగమాంబలో పీలా గోవిందు పాత్ర బహిర్గతం



తాను భాగస్వామినంటూ స్వయంగా వెల్లడి

‘దాని జోలికి వెళ్లక’ అని హెచ్చరిక

సమాచారం అడిగిన సమాజ్‌వాదీ పార్టీ నేతకు ఫోన్

‘సాక్షి’ చేతిలో ఆడియో రికార్డు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

మైనింగ్ వ్యవహారాలపై సమాచారం సేకరిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురువయ్యకు పీలా గోవిందు ఫోన్ చేశారు. అక్రమంగా మైనింగ్ చేస్తున్న వెంగమాంబ క్రషర్స్‌లో భాగస్వామినంటూ ఆయనే స్వయంగా వెల్లడించారు. దాని జోలికి వెళ్లకని హెచ్చరించారు. ఆయన వాయిస్ రికార్డు ‘సాక్షి’కి చిక్కింది. ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్‌ఐడీసీ) చైర్మన్‌గా వ్యవహరిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ అక్రమ మైనింగ్‌లో భాగస్వామి అనే విషయం పై మాటల ద్వారా స్పష్టమవుతోంది. ఇన్ని రోజులుగా వెంగమాంబ స్టోన్ క్రషర్స్ తెరవెనుక ఉండి వ్యవహారాలను శ్రీనివాస చౌదరి చక్కబెడుతుండగా... అసలైన సూత్రధారి పీలా గోవిందని ఈ ఆడియో రికార్డుతో తేలిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శ్రీనివాస చౌదరి బీజేపీలో ఉండగా.... పీలా గోవిందు టీడీపీలో ఉండి అనకాపల్లి జిల్లాలో అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నారని స్పష్టమవుతోంది. అసలు అనుమతి లేని, కోర్టు పరిధిలో ఉన్న క్వారీలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌లో అధికార పార్టీకి చెందిన నేతలు తమ పాత్ర స్వయంగా ఒప్పుకోవడం గమనిస్తే ఆశ్చర్యమేస్తోంది. తాము అక్రమ మైనింగ్ చేస్తున్నామని వారే నోరు విప్పి చెబుతున్నారంటే.. తమపై ఎవ్వరూ చర్యలు తీసుకోలేరనే ధైర్యమే కారణమని, ఆ ధీమా వారి మాటల్లో కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



వెంగమాంబ క్రషర్స్‌లో జోరుగా సాగుతున్న కార్యకలాపాలు

అనకాపల్లి అంతటా అక్రమ మైనింగే...!

అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా భారీగా అక్రమ మైనింగ్ వ్యవహారాలు నడుస్తున్నాయి. ఒక్క అనకాపల్లి మండలంలోనే ఏకంగా 30కి పైగా క్వారీల్లో అనుమతి లేకుండా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఒక్క మండలంలోనే రోజుకు 1000 ట్రిప్పుల బండరాళ్లు అనకాపల్లి రూరల్ ప్రాంతంలోని వివిధ అధికార, అనధికార క్వారీల నుంచి మునగపాక మీదుగా రాంబిల్లిలోని నావికాదళ పనుల వరకూ ప్రతి రోజూ చక్కర్లు కొడుతున్నాయి. 32–36 టన్నుల సామర్థ్యం కలిగి ఉన్నా ఏకంగా 50 టన్నుల మేరకు భారీ బండ రాళ్లు వేసుకుని తిరుగుతున్న ఈ టిప్పర్లను అటు మైనింగ్ అధికారులు కానీ, ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు కానీ కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఇక చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో చేపడుతున్న అధికార, అనధికార మైనింగ్ ద్వారా ప్రతి రోజూ పదుల సంఖ్యలో లారీల నుంచి కంకర తరలివెళుతోంది. గుర్తింపు ఉన్న క్వారీల నుంచి తరలిస్తున్న వాటికి సీనరేజి కింద ప్రభుత్వం వసూలు చేసే మొత్తానికి అదనంగా టన్నుకు రూ.250 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని కూటమి నేత ‘ఏపీ’ ట్యాక్స్ పేరుతో అధికారికంగా వసూలు చేస్తుండటం గమనార్హం. తద్వారా ప్రతి రోజూ రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారు. అంటే నెలకు రూ.3 కోట్ల మేర ‘ఏపీ’ ట్యాక్స్ పేరుతో వసూలు చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు నర్సీపట్నం నియోజకవర్గంలో ఏకంగా లేటరైట్‌కు అటవీ మార్గం గుండా రైట్ రైట్ చెబుతున్నారు. అసలు ఎంత మొత్తం తరలిస్తున్నారనే లెక్కలను కూడా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. వారు చెప్పిందే లెక్క అనే రీతిలో అక్కడ వ్యవహారం నడుస్తోంది.

లంచాలకు అధికారులు సలాం!

కేవలం ఒక్క అనకాపల్లి మండలంలోని అక్రమ మైనింగ్ ద్వారానే మైనింగ్ అధికారులకు నెలవారీగా రూ.50 లక్షల చొప్పున ముట్టచెబుతున్నారనే ఆరోపణలున్నాయి. అందుకే అనుమతి లేని క్వారీల్లో కూడా అడ్డగోలుగా మైనింగ్ నడుస్తోంది. ఇక అనుమతి ఉన్న కొద్దిపాటి క్వారీల్లో అనుమతికి మించి మైనింగ్ జరుగుతోంది. ఈ వ్యవహారాలను చూసీచూడనట్టు ఉండేందుకు గానూ ప్రతి నెలా కేవలం మైనింగ్ అధికారులకే రూ.50 లక్షల చొప్పున ముట్టచెబుతున్నారనే విమర్శలున్నాయి. ఇక రవాణా, రెవెన్యూ అధికారులకూ ఇందులో వాటాలు ఉండటంతో కిమ్మనకుండా ఉంటున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మొదట్లో అనుమతికి మించి లోడుతో వస్తున్నాయంటూ లారీలను నిలిపిన పోలీసు అధికారులు కూడా ఇప్పుడు అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. వారికి వాటా ముడుతుండటంతోనే పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తద్వారా సహజ సంపదను ఇష్టారాజ్యంగా కూటమి నేతలు అందినకాడికి దోచుకుంటున్నారు.

ఫోన్ చేసి నాదే అని చెప్పారు

అనకాపల్లి మండలంలోని అక్రమ మైనింగ్‌పై ఆర్‌టీఐ ద్వారా సమాచారం అడిగాను. వెంగమాంబ క్వారీ జోలికి వెళ్లక అని పీలా గోవిందు ఫోన్ చేశారు. అందులో తనకు వాటా ఉందని చెప్పారు. తన తండ్రి కాలం నుంచే శ్రీనివాస చౌదరి తండ్రితో వ్యాపార భాగస్వామ్యం ఉందని నాకు ఫోన్‌లో చెప్పారు. అక్రమ మైనింగ్ నడుస్తోందని నేను అంటే ఇలాంటివి బోలెడున్నాయని కూడా అన్నారు. ఇలా ఫోన్ చేయడం ఎలా కరెక్ట్?

– కోన గురువయ్య, సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

29న ఖరీఫ్‌కు ‘రైవాడ’ నీరు విడుదల



దేవరాపల్లి: రైవాడ జలాశయం నుంచి ఖరీఫ్ సాగుకు ఈనెల 29న నీటిని విడుదల చేయనున్నట్లు జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు తెలిపారు. రైవాడ అతిథి గృహంలో ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. నీటి విడుదలపై వీరందరితో చర్చించిన అనంతరం ఈనెల 29న నీటిని విడుదల చేయాలని నిర్ణయానికి వచ్చారు. ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 111.30 మీటర్లు ఉందని, ఖరీఫ్ సాగుకు ఢోకా లేదని డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. ఈ సమావేశంలో చోడవరం డీఈఈ వేణుగోపాల్, నాయకులు కిలపర్తి భాస్కరరావు, కొమర బాబూరావు, దొగ్గ దేముడునాయుడు, వివిధ నీటి సంఘాలు అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జడ్జి, న్యాయవాదుల మధ్య సమన్వయం అవసరం

చోడవరం: సభ్యుల సంక్షేమానికి బార్ అసోసియేషన్ మరింతగా కృషి చేయాలని జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు అన్నారు. చోడవరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం స్థానిక కోర్టుల ఆవరణలో బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్జి, న్యాయవాదుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. అప్పుడే కేసులు త్వరగా పరిష్కారం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. చోడవరం కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు హైకోర్టుకు ప్రతిపాదనలు పంపుతానని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌కు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం జిల్లా జడ్జిని ఘనంగా సత్కరించారు. చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి కె.నరేష్, సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్, న్యాయమూర్తులు బి.సూర్యకళ, లావణ్య, రాము, స్టేట్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణమోహన్, చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కామిరెడ్డి వెంకట్రావు, చీపురపల్లి సూర్యనారాయణ, మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ దుస్థితిపై హైకోర్టు సీరియస్

- సౌకర్యాల లేమిపై న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నివేదికపై స్పందన
- సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశం



ఎస్సీ బాలికల వసతిగృహం

నర్సీపట్నం: ఇక్కడ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహంలో సౌకర్యాల లేమిపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పందించింది. హైకోర్టు ఆదేశాలతో గత ఏడాది అక్టోబర్ నెలలో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ నియోజకవర్గంలోని పలు వసతిగృహాలను పరిశీలించారు. అప్పుడు నర్సీపట్నం ఎస్సీ బాలికల వసతిగృహంలో మరుగుదొడ్ల సౌకర్యం సరిగా లేని విషయాన్ని గమనించారు. అప్పటికీ ఒక్కటి మాత్రమే నిర్వహణలో ఉంది. ఇదే విషయం ఆయన ఉన్నత న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన సమస్యలతోపాటు ఈ సమస్యను హైకోర్టు ప్రత్యేకంగా గుర్తించింది. ఈనెల 21న సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి స్వయంగా తమ ఎదుట హాజరై తీసుకోబోయే చర్యల గురించి వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

రెట్టింపు సంఖ్యలో విద్యార్థినులు

దాదాపు ఐదు దశాబ్దాల క్రితం 120 మంది విద్యార్థినులు ఉండేందుకు వీలుగా ఈ వసతిగృహాన్ని నిర్మించారు. ప్రస్తుతం 228 మంది బాలికలు ఇక్కడ ఉంటున్నారు. వీరిలో ఉన్నత పాఠశాల విద్యార్థినులు 170 మంది కాగా, 58 మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు. వాస్తవానికి కాలేజీ విద్యార్థినుల హాస్టల్ ప్రత్యేకంగా నిర్వహించాల్సి ఉంది. వసతిగృహంలో పది మరుగుదొడ్లు, మరో పది స్నానాల గదులు ఉన్నాయి. చాలకాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే వీటిన్నింటికీ మరమ్మతులు పూర్తి చేశారు. అయినప్పటికీ మూడు మరుగుదొడ్లు బాగులేవని విద్యార్థినులు వినియోగించటం లేదు.

అట్రాసిటీ కేసులపై తక్షణం స్పందించాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్
- కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం



జిల్లా అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ సమీక్ష

తుమ్మపాల: ఎస్సీల అభ్యున్నతి లక్ష్యంగా అధికారులు అడుగులు వేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ కోరారు. అట్రాసిటీ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, తదితర జిల్లా అధికారులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎస్సీ సామాజిక వర్గాల్లో అక్షరాస్యత పెంపు, వివిధ పథకాల అమలు, ఆరోగ్యం, పోషణ, భూ పంపిణీ, నవోదయం వంటి అంశాలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, వాటి పురోగతిని, గ్రామాల్లో సైతం సీసీ కెమెరాల ద్వారా నిఘా వంటి విషయాలను ఎస్పీ తుహిన్ సిన్హా తెలియజేశారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు పూర్తి పని దినాలు కల్పించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు సహకారం అందించాల్నారు. అట్రాసిటీకి సంబంధించి ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి అరెస్టుకు చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకోసారి తప్పనిసరిగా జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్ మీడియాతో మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీ కేసులను నీరు కారుస్తున్న పోలీసులు

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో స్టేషన్ బెయిల్ రద్దు చేసి, కేసును నీరుకార్చే విధంగా ఉన్న పోలీసుల విధి విధానాలను మార్పు చేయాలని కోరుతూ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్‌కు ఉమ్మడి విశాఖ జిల్లా డీవీఎంసీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు, స్టీల్ ప్లాంట్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. అనకాపల్లి జిల్లాకు ప్రత్యేక అంబేడ్కర్ భవనం, అంబేడ్కర్ విగ్రహం, ప్రత్యేక ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ ఎస్సీ, ఎస్టీ కోర్టు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, ఎం.అప్పలరాజు, అంబేడ్కర్ భవనం చైర్మన్ బొడ్డు కళ్యాణరావు, కార్యదర్శి జె.సి.ప్రభాకర్, స్టీల్ ప్లాంట్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య పాల్గొన్నారు

అమ్మకానికి అంగన్‌వాడీ పోస్టు

- రూ.4 లక్షలు ఇచ్చిన వారికే ఉద్యోగం
- అర్హత ఉన్నా అన్యాయం చేశారు
- బాధితురాలు సునీత ఆరోపణ
- వరుసగా రెండో రోజు రిలే నిరాహార దీక్ష
- తిమ్మరాజుపేట అంగన్‌వాడీ పోస్టుకు ఎస్సీ రిజర్వేషన్
- అర్హత లేనివారిని నియమించారని బాధితురాలి ఆవేదన



అచ్యుతాపురంలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న దళిత మహిళ మంత్రి సునీత, తిమ్మరాజుపేట దళితులు

సాక్షి, అనకాపల్లి: కూటమి నేతలు అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తమకు ఎవరు డబ్బులిస్తే వారికే ఉద్యోగమంటూ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట అంగన్‌వాడీ హెల్పర్ పోస్టును అన్ని అర్హతలు, మెరిట్ ఉన్నా తనకు రాకుండా చేశారని స్థానిక ఎమ్మెల్యే సోదరుడిపై దళిత మహిళ మంత్రి సునీత ఆరోపిస్తున్నారు. తనకు న్యాయం చేయాలంటూ అచ్యుతాపురంలో బుధవారం నుంచి ఆమె రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ పోస్టును దళితులకు కేటాయించారని, మెరిట్, అర్హత ఉన్న తనకు కాకుండా.. స్థానిక జనసేన ఎమ్మెల్యే సోదరుడు రూ.4 లక్షలకు ఉద్యోగాన్ని అమ్ముకున్నారని ఆమె ఆరోపిస్తున్నారు. బీసీ కులానికి చెందిన కోడలికి ఈ ఉద్యోగం అమ్ముకున్నారని, తనకు న్యాయం జరిగే వరకూ పోరాడతానని బాధితురాలు స్పష్టం చేశారు.

సునీతకే గ్రామస్తుల మద్దతు

తిమ్మరాజుపేట గ్రామ అంగన్‌వాడీ హెల్పర్ అనారోగ్యం కారణంగా మరణించడంతో ఆ పోస్టుకు గత ఏప్రిల్ నెలలో నోటిఫికేషన్ వచ్చింది. గతంలో బీసీ రిజర్వేషన్ ఉన్న ఈ హెల్పర్ ఉద్యోగానికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించారు. ఈ పోస్టుకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ ఆధారంగా అన్ని అర్హతలున్న మంత్రి సునీతకే ఈ పోస్టు కేటాయించాలని సర్పంచ్‌తోపాటు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దగ్గరకు వెళ్లి సిఫారసు చేశారు. దీనికి ఎమ్మెల్యే అంగీకారం కూడా తెలిపారు. దీంతో సునీతతోపాటు ఆమె కుటుంబం కూడా తమకే ఈ ఉద్యోగం వస్తుందనే ఆశతో ఉన్నారు. అయితే మరో మహిళను ఈ పోస్టులో నియమించారు. ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించిన పోస్టును బీసీలకు ఇచ్చారంటూ తిమ్మరాజుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద సునీత రిలే నిరాహార దీక్ష ప్రారంభించి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

అన్ని అర్హతలు, మెరిట్ ఉన్నా దళిత కులానికి చెందిన తనకు ఉద్యోగం రాకుండా స్థానిక ఎమ్మెల్యే సోదరుడు అడ్డుకున్నాడంటూ మంత్రి సునీత ఈనెల 14వ తేదీన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆ ఫిర్యాదును ఐసీడీఎస్ పీడీకి అప్పగించారు. పీడీ ఆదేశం మేరకు యలమంచిలి ఐసీడీఎస్ అధికారులు తిమ్మరాజుపేట గ్రామానికి వెళ్లి విచారణ చేసి కలెక్టర్ నివేదిక అందజేశారు.

రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు నిధులు

- రూ.1.35 లక్షలు విడుదల చేసిన వైస్ ఎంపీపీ
- సాక్షి కథనానికి స్పందన
- వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవ
- ఆయకట్టు రైతుల్లో ఆనందం



మరమ్మతులకు నిధులు విడుదల ఉత్తర్వులు అందుకుంటున్న ఆయకట్టు రైతులు

నక్కపల్లి: ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షానే ఉంటామని నిరూపించారు వైఎస్సార్‌సీపీ నేతలు. అన్నదాతల సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేశారు. ఖరీఫ్‌లో సాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టిన వైఎస్సార్‌సీపీకి చెందిన మండల పరిషత్ పాలక వర్గానికి రైతులు కృతజ్ఞతలు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మెరక గ్రామాల రైతులకు సాగునీరు అందించే చీడిక రిజర్వాయర్ మరమ్మతులకు గురైంది. 40 ఏళ్ల క్రితం సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ రిజర్వాయర్‌ను నిర్మించారు. దీని కింద చీడిక, కొత్తూరు, డొంకాడ, జగన్నాథపురం, రమణయ్యపేట, ముకుందరాజుపేట, సీతానగరం, తదితర గ్రామాల పరిధిలో సుమారు 800 ఎకరాల ఆయకట్టు ఉంది. కొన్నాళ్లుగా రిజర్వాయర్ గేట్లు పూర్తిగా తుప్పుపట్టాయి. గేట్లు ఎత్తడానికి, దించడానికి అవకాశం లేదు. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. ఈ సమస్యలపై ఈనెల 7న ‘నీళ్లున్నా.. బీళ్లుగానే’ శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి వైఎస్సార్‌సీపీ నాయకులు స్పందించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, తదితరులు రిజర్వాయర్ నీటి సంఘం వైస్ చైర్మన్ కరణం ఈశ్వరరావు, డైరెక్టర్ నారపురెడ్డి కుమారితో కలసి గురువారం చీడిక రిజర్వాయర్‌ను పరిశీలించారు. తుప్పుపట్టిన గేట్లను, రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న కాలువలను చూశారు. వెంటనే వైస్ ఎంపీపీ వీసం నానాజీ తన కోటా నుంచి మండల పరిషత్ నిధులు సుమారు రూ.1.35 లక్షలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఎంపీడీవోతో మాట్లాడి తక్షణమే గేట్లు మరమ్మతులకు నిధులు విడుదల చేస్తూ పరిపాలన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులను ఆయకట్టు రైతులకు అందజేశారు. త్వరలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కాలువల పూడిక తీతకు నిధులు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రిజర్వాయర్‌ను పరిశీలించిన వారిలో గొడిచర్ల పీఏసీఎస్ మాజీ చైర్మన్ పొడగట్ల పాపారావు, పార్టీ నాయకులు కాకర వెంకటరావు, నానేపల్లి గోవిందు, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: వృద్ధురాలు అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు వివరాల మేరకు... స్థానిక గవరపాలేనికి చెందిన మద్దాల పాపారత్నం(73) ఈ నెల 15న మధ్యాహ్నం తన కుమార్తె ఇంటికెళ్లి వస్తానని కుమారుడికి చెప్పింది. అటు కుమార్తె, ఇటు కుమారుడు ఇళ్లకు రాకపోవడంతో ఆందోళన చెందిన వారు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దాంతో కుమారుడు మద్దాల వెంకట మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మతి స్థిమితం లేని వృద్ధురాలు మృతి

బుచ్చెయ్యపేట: చింతపాక–తురుకలపూడి గ్రామాల సరిహద్దు కొండల దగ్గర జీడిమామిడి తోటల దగ్గర పొలాల్లో గురువారం ఓ వృద్ధురాలు మృతదేహాన్ని రైతులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బుచ్చెయ్యపేట ఎస్‌ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో ఆమె నాలుగైదు రోజుల కిందట చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతురాలు తురకలపూడి గ్రామ సర్పంచ్ గోవింద్ మేనత్త నూకాలమ్మ (73)గా గుర్తించారు. ఆమె చెల్లూరు నుంచి నెల రోజుల క్రితం వచ్చి అల్లుడైన సర్పంచ్ గోవింద్ దగ్గర ఉంటుంది. ఆమెకు మతి స్థిమితం ఉండేది కాదు. అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయి తిరిగి వస్తుండేది. వారం రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి పోవడంతో అలాగే తిరిగి వస్తుందని కుటుంబ సభ్యులు ఎదురు చూశారు. ఇంతలో పొలాల మధ్య ఆమె మృతదేహం వెలుగు చూసింది. మృతదేహం బాగా పాడైపోవడంతో అక్కడే పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకుఅప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

విశాఖ సిటీ: ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారీటైం అండ్ షిప్‌బిల్డింగ్(సెమ్స్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణశివమ్(రిటైర్డ్) తెలిపారు. 27 ఏళ్లలోపు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లమో, ఐటీఐలో ఫిట్టర్, టర్నర్, ఇంటర్, డిగ్రీ, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో గానీ, 8688411100, 8331901237, 0891–2704010 సంప్రదించి ఈ నెల 22 తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

హత్య కేసులో నలుగురు అరెస్టు

అల్లిపురం: ప్రకాశరావుపేటలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి జరిగిన చెట్టి ఎల్లాజీ అలియాస్ వట్టి (21) హత్య కేసులో టూటౌన్ పోలీసులు నలుగురు యువకులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కొత్తసాలిపేటకు చెందిన గొలగాని శరత్ అలియాస్ అయ్యప్ప, చోడివీధికి చెందిన గరుగుబిల్లి దుర్గా ప్రసాదు అలియాస్ యాదర దుర్గ, గంజిపేటకు చెందిన కోన పృథ్వీ అలియాస్ పండు, ఆరిలోవ దుర్గా బజార్‌కు చెందిన దండేటి సాయి అలియాస్ మణికంఠ సాయిలను రిమాండ్‌కు పంపారు.

యాజమాన్య నిర్లక్ష్యానికి యువకుడి బలి

- కాంక్రీట్ టిప్పర్ ఢీకొని తీవ్ర గాయాలు
- అమానవీయంగా ట్రాక్టర్ తొట్టెలో తరలింపు
- మార్గమధ్యంలో పశ్చిమ బెంగాల్ కూలీ మృతి
- సకాలంలో అందని వైద్య సేవలు


మృతి చెందిన రాజేష్ హేమీరామ్


గాయపడిన యువకుడ్ని ట్రాక్టర్ తొట్టెలో తీసుకెళ్తున్న కూలీలు

యలమంచిలి రూరల్: యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి పొట్టకూటి కోసం వచ్చిన పశ్చిమ బెంగాల్ యువకుడి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పోలవరం కాలువ పనుల్లో అతడిని కాంక్రీట్ టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా ఢీకొట్టాడు. రాత్రి 10.45 గంటలకు ఈ ఘటన జరగ్గా, యలమంచిలి సీహెచ్‌సీకి 1.30 గంటలకు తరలించారు. అంటే దాదాపు 3 గంటలు ఆలస్యం చేశారు. దాంతో సకాలంలో తరలించి చికిత్స అందించకపోవడంతో వలస కూలీ మృత్యువుతో పోరాడి మార్గమధ్యంలో మృతి చెందాడు.

యలమంచిలి మండలం ఏటికొప్పాక సమీపంలో బుధవారం రాత్రి కాంక్రీట్ టిప్పర్ ఢీకొట్టిన ప్రమాదంలో రాజేష్ హేమీరామ్(20) మృతి చెందాడు. ఈ ఘటనలో నిర్మాణ సంస్థ అడుగడుగునా నిర్లక్ష్య వైఖరి చూపడంతోనే ప్రాణాలు పోయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు... యలమంచిలి మండలం ఏటికొప్పాక సమీపంలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ 7వ ప్యాకేజి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ పశ్చిమ బెంగాల్‌కు చెందిన వంద మందికి పైగా కూలీలు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో పనుల్లో వినియోగిస్తున్న కాంక్రీట్ మిల్లర్ వాహనాన్ని డ్రైవర్ పార్కింగ్ చేస్తుండగా, అక్కడ ఫోన్లో మాట్లాడుతున్న యువకుడ్ని ఢీకొట్టడంతో అతడు చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడికి ప్రథమ చికిత్స అందించి, అత్యవసర చికిత్స కోసం నిర్మాణ సంస్థ ప్రయత్నించలేదని తెలుస్తోంది.

రాత్రి 10.45 గంటలకు జరిగిన ఘటన..

వాస్తవానికి రాత్రి 10.45 గంటలకు ప్రమాదం జరిగినట్టు యలమంచిలి రూరల్ పోలీసులకు మృతుడు సంబంధీకుడు తుషార్ బిశ్వాస్ ఫిర్యాదు చేశాడు. ఘటన తర్వాత కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడ్ని ఓ ట్రాక్టర్ తొట్టెలో ఉంచి 15 కిలోమీటర్ల దూరాన ఉన్న యలమంచిలి సీహెచ్‌సీకి తరలిస్తున్నారు. ఈ క్రమంలో నాలుగు కిలోమీటర్లు దాటి చినగుమ్ములూరు వరకు వచ్చేసరికి రాత్రి 11.30 గంటల ప్రాంతంలో అంబులెన్సు వాహనం వచ్చింది. సిబ్బంది క్షతగాత్రుడ్ని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. మృతదేహాన్ని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించడానికి నిరాకరించినట్టు తెలిసింది.

రాత్రి 1.30 గంటలకు తీసుకొచ్చినట్టు ఆస్పత్రి రికార్డులో నమోదు

యువకుడిని యలమంచిలి ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అక్కడ సీహెచ్‌సీకి రాత్రి 1.30 గంటలకు తీసుకొచ్చినట్టు రికార్డుల్లో నమోదైంది. అంటే మూడు గంటల సేపు క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తీసుకురావడంలో జాప్యం జరిగింది. తీవ్ర రక్తస్రావమవుతున్న యువకుడ్ని కేసీఎల్ సంస్థకు చెందిన బొలేరో వాహనంలో ఆస్పత్రికి తరలించినట్టు సంస్థ ప్రతినిధి త్రినాథ్ సాక్షికి తెలిపారు.

ఇతర రాష్ట్రాల కూలీలతో పని..

ప్రమాదవశాత్తు ఎవరైనా కూలీలు మరణిస్తే ఎటువంటి వివాదాలు, పెద్ద మొత్తంలో నష్టపరిహారం డిమాండ్లు వంటివి తలెత్తకుండా ఉండేందుకు వీలుగా కాంట్రాక్టు సంస్థ ఇతర రాష్ట్రాల కూలీలనే పనిలో పెట్టుకుంటున్నట్టు సమాచారం. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే మనకి కూడా ఇదే పరిస్థితి వస్తుందన్న ఆందోళన అక్కడి కూలీల్లో నెలకొంది. ఈ ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర తెలిపారు. యువకుడి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

అన్ని పోలీస్ స్టేషన్లలో ఐసీజేఎస్ 2.0 అమలు

డెస్క్‌టాప్‌లు, వెబ్ కెమెరాలు, ఎం.ఎఫ్.ప్రింటర్లు పంపిణీ చేసిన ఎస్పీ తుహిన్ సిన్హా


వెబ్ కెమెరాలు, ఎం.ఎఫ్.ప్రింటర్లను సీఐలకు కంప్యూటర్‌ను అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లకు ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ 2.0 అనేది క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌లోని వివిధ భాగాలను దిగువస్థాయి పోలీస్ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తమ కార్యాలయంలో ఐసీజేఎస్‌ను పట్టణ, ట్రాఫిక్, రూరల్ పోలీస్ స్టేషన్ సీఐలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఐసీజేఎస్ 2.0 ప్రాజెక్ట్ అమలు చేయడానికి అవసరమైన సాంకేతిక పరికరాలను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, టెక్నికల్ సర్వీసెస్, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన 136 ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్‌లు, 34 వెబ్ కెమెరాలు, 39 ఎం.ఎఫ్.ప్రింటర్లు జిల్లాలోని 34 పోలీస్ స్టేషన్లకు పంపిణీ చేశామన్నారు. క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌లోని వివిధ భాగాలను (పోలీస్, కోర్టులు, జైళ్లు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, ప్రాసిక్యూషన్) సమన్వయం చేసి, డేటా సమాచారాన్ని సులభంగా పంచుకునే విధంగా రూపొందించిన ఒక ప్రాజెక్టు అన్నారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సాంకేతిక పరికరాల ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం అవుతూ, విధుల నిర్వహణలో నాణ్యత మరింతగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పీజీ ఫస్ట్ ర్యాంకర్‌కు అభినందన


డెంటల్ విభాగంలో మొదటి ర్యాంకర్‌ను అభినందిస్తున్న కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: నీట్ పీజీ –2025 డెంటల్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన యలమంచిలి మున్సిపాలిటీలోని కట్టుపాలెంకు చెందిన నానేపల్లి సాయితేజను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అభినందించారు. గురువారం సాయితేజ ధర్మశ్రీని కలిసి తన విజయాన్ని వివరించారు. ఇటీవల ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ విడుదల చేసిన నీట్ పీజీ –2025 డెంటల్ విభాగం ఫలితాల్లో సాయితేజ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌గా నిలవడం నియోజకవర్గానికి, జిల్లాకు గర్వకారణంగా ధర్మశ్రీ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. సాయితేజ 960/667 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 222 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. తాను భవిష్యత్తులో రక్షణ శాఖలో మంచి అధికారిగా స్థిరపడాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్టు సాయితేజ ఈ సందర్భంగా తెలిపాడు. కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, పందూరి గోవిందరావు, ఆనంద్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల భూమి.. ఎన్నారైలకు అమ్మేసి..

- ఫేస్‌బుక్ ద్వారా పరిచయం పెంచుకుని రూ.53.78 లక్షలకు టోకరా
- బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరు అరెస్ట్


మాట్లాడుతున్న నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు

మధురవాడ: ఫేస్‌బుక్ ద్వారా రియల్ ఎస్టేట్ ఏజెంట్లుగా పరిచయం చేసుకుని.. ముగ్గురు రిటైర్డ్ ప్రొఫెసర్లకు చెందిన భూమిని తమదిగా చూపించి.. ఓ ఎన్నారై దంపతులను అమ్మేసిన ఇద్దరిని గురువారం పీఎంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను విశాఖ నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు మీడియా సమావేశంలో వెల్లడించారు. విశాఖపట్నానికి చెందిన వాడుకుల మణికుమారి, వాడుకుల ప్రసాదరావు దంపతులు ఉద్యోగ రీత్యా ఖతార్‌లో నివసిస్తున్నారు. వీరు విశాఖలో స్థలం కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఫేస్‌బుక్‌లో స్థలాల వివరాలు, ధరలను పరిశీలిస్తున్నారు. ప్రసాదరావు స్థలాల కోసం వెతకడాన్ని గమనించిన పిల్లి అశోక్ (మునగపాక వాస్తవ్యుడు, ప్రస్తుతం ఖతార్ నివాసి) తాను రియల్ ఎస్టేట్ ఏజెంట్‌నని పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత మల్కాపురానికి చెందిన ఎజ్జల శ్రీనివాస్ అలియాస్ దుబాయ్ శ్రీను అలియాస్ దుర్గామహేశ్వరరావును పరిచయం చేశాడు. అతను 'మెస్సర్స్ ఎంజ్ గ్రూప్'అధినేత అని, తామిద్దరం విదేశాల్లో నివసించే విశాఖవాసులకు స్థలాలు అమ్మడం, కొనడం వంటి పనులు చేస్తుంటామని నమ్మబలికారు. మధురవాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4పీ, టీచర్స్ లేఅవుట్, ఎంఐజీ 50లో ఉన్న 311.11 గజాల ప్లాట్‌లో సగభాగం(155.55 గజాలు) అమ్మకానికి ఉందని నిందితులు తెలిపారు. ఆ స్థలం కొండేటి మీనాక్షి, కొండేటి రూప్‌కుమార్‌ల పేర్ల మీద ఉందని, వాళ్లే నిజమైన వారసులని నమ్మించారు. ఆన్‌లైన్‌లో చెబితే ఎలా నమ్మాలని ప్రసాదరావు ప్రశ్నించగా.. 'మీరు స్థలం తీసుకోవడానికి అంగీకరిస్తే.. ముందుగా మీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తాం. ఆ తర్వాతే డబ్బు పంపితే చాలు'అని నిందితులు చెప్పడంతో ప్రసాదరావు అంగీకరించారు. ఇరువురి మధ్య ఒప్పందం కుదరడంతో 2024 జూలై 30న వాడుకుల నాగమణి పేరు మీద టీచర్స్ లేఅవుట్‌లోని 155.55 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో బాధితులు గత సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో దఫదఫాలుగా దుబాయ్ శ్రీను బ్యాంకు ఖాతాకు రూ.53,78,875 లను ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. ఇటీవల విశాఖ వచ్చిన బాధితులు తమ స్థలాన్ని చూసుకునేందుకు ప్రయత్నించగా.. అసలు ఆ స్థలానికి, దానిని అమ్మినవారికి ఎలాంటి సంబంధం లేదని, తాము మోసపోయామని గ్రహించారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని నిందితులను కోరినా ప్రయోజనం లేకపోయింది. దీంతో బాధితులు ఈ నెల 12న పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐ భాస్కరరావులు.. నిందితులు నకిలీ పత్రాలతో బాధితులను మోసగించినట్లు నిర్ధారించారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు అయిన కొండేటి రూప్‌కుమార్, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, కొల్లిపర వెంకట దినకర్‌లకు చెందిన టీచర్స్ లేఅవుట్‌లోని ఎంఐజీ 49, 50, 51 ప్లాట్లకు చెందిన 900 గజాల భూమిని..155.55 గజాల చొప్పున ఆరు భాగాలుగా విభజించి అమ్మడానికి నిందితులు ప్రయత్నించినట్లు తేలింది. ఇందులో ఒక భాగాన్ని ప్రసాదరావు దంపతులకు విక్రయించగా, మిగిలిన ఐదు భాగాలను వేరే వ్యక్తులకు అమ్మజూపారు. దీంతో నిందితులైన దుబాయ్ శ్రీను, పిల్లి అశోక్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు విచారణలో ప్రతిభ కనబరిచిన సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐ భాస్కరరావులను ఏసీపీ అప్పలరాజు అభినందించారు.

గాయత్రీదేవికి ఘన సన్మానం


గాయత్రీదేవిని సన్మానిస్తున్న దృశ్యం

నక్కపల్లి: విశ్రాంత తెలుగుపండితురాలు, ఉపమాక వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల వ్యాఖ్యాత, ప్రముఖ కవయిత్రి డాక్టర్ వేదాల గాయత్రీదేవిని ఆధ్యాత్మిక, సాహిత్యరంగాల్లో విశేష సేవలు అందిస్తున్నందుకు అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ వారు గురువారం ఘనంగా సన్మానించారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గాయత్రీదేవిని ప్రవచన శిఖామణి దురంధర బిరుదును ప్రదానం చేస్తూ దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. గతంలో ఆమె ఉపమాక వేంకటేశ్వరస్వామిపై షడ్భుజ వేంకటేశ్వర పద్యకావ్యాన్ని రచించారు. అలాగే శ్రీవ్రతం, గరుడాచల మహాత్మ్యం, నృసింహాక్షర సుప్రభాతం, నృసింహశతకం, విష్ణు సహస్ర నామ పద్యావళి, శతక గాయత్రీ (6శతకాల సమాహారం) వంటి రచనలు చేశారు. ఆమెకు ఉపమాక దేవస్థాన ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, తాలూకా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు డి.వి.రామారావు, సత్యదేవశర్మ, శ్రీపాద ప్రణవ్‌రామ్, సత్యభాస్కర ప్రసాద్, రామకృష్ణ, మురళి అభినందనలు తెలిపారు.

జ్వరాలు తగ్గే వరకూ వైద్య శిబిరాలు

జ్వర ప్రభావిత గ్రామాల్లో డీఎంహెచ్‌వో హైమావతి పర్యటన


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

నాతవరం: గ్రామాల్లో జ్వరాలు తగ్గేంత వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎం. హైమావతి తెలిపారు. కలెక్టరు ఆదేశాలు ప్రకారం మండలంలో డి.యర్రవరం, మాధవనగరం, నాతవరం, చమ్మచింత, గుమ్మడిగొండ గ్రామాల్లో రెండు రోజులుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలను గురువారం ఆమె సందర్శించారు. అనంతరం నాతవరం పీహెచ్‌సీలో మాట్లాడుతూ జిల్లాలో అక్కడక్కడ విష జ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. నాతవరం మండలంలో అధికంగా జ్వరాలు ఉన్నట్టు తమ దృష్టికి రావడంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు చేస్తున్నారన్నారు. పంచాయతీ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా తాగునీటి పథకాలు, డ్రైనేజీలు శుభ్రం చేస్తున్నారన్నారు. మలేరియా, చికున్‌గున్యా పరీక్షలకు కిట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. అల్లూరి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన 12 మంది వైద్యాధికారులు మన జిల్లాలో చేరి తిరిగి వెనక్కి వెళ్లిపోయారన్నారు. ప్రభుత్వం కొత్తగా వైద్యాధికారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుందన్నారు. వారు వచ్చేంత వరకు వైద్యుల కొరత వెంటాడుతుందన్నారు. నాతవరం పీహెచ్‌సీలో మాత్రం జ్వరాలు తగ్గేంత వరకు ఇద్దరు వైద్యాధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి డీఎంహెచ్‌వోను కలిసి మండల వ్యాప్తంగా జ్వరాల తీవ్రత అధికంగా ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనిటీ అధికారి చంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రాం అధికారి నేతల ప్రశాంతి, వైద్యాధికారి ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది పోస్టాఫీసులో నిధులు గల్లంతు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది పోస్టాఫీసులో ఉద్యోగి చేతివాటం చూపించారు. ఖాతాదారులు కట్టిన ఆర్‌డీలు, రోజువారి లావాదేవీలు, ఇతరత్రా నగదు సుమారు రూ. 8.32 లక్షలు నగదు జమ చేయకుండా పక్కదారి పట్టించారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు పోస్టాఫీసు అధికారులు ఫిర్యాదు చేశారు. పోస్టాఫీసులో పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు గత వారం రోజులుగా విధులకు హాజరుకాలేదు. ఖాతాదారులు కట్టిన ఇతరత్రా పొదుపు సొమ్మును ఎప్పటికప్పుడు నర్సీపట్నం డివిజన్ కార్యాలయంలో జమ చెయ్యాలి. అలా చెయ్యకుండా మెత్తం నగదును తన వద్దే ఉంచుకొని తన స్వంత అవసరాలకు వాడుకున్నారు. నాగేశ్వరరావు వారం రోజుల నుంచి పోస్టాఫీసుకు రాకపోవడంతో ఖాతాదారులు సిబ్బందిని నిలదీసారు. దీంతో సిబ్బంది ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నర్సీపట్నం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్‌ను సమగ్ర విచారణకు ఆదేశించారు. ఆయన వడ్డాది పోస్టాఫీసుకు వచ్చి విచారణ చేపట్టారు. రికార్డులను తనిఖీ చేసి నగదు లావాదేవీలను పరిశీలించారు. నాగేశ్వరరావు పోస్టాఫీసు సొమ్ము రూ.8.32 లక్షలు వాడుకున్నట్టు నిర్ధారించారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టాఫీసులో అనకాపల్లి నుంచి పోస్టుమాస్టర్‌గా నియమించి పోస్టాఫీసు రోజువారీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఖాతాదారులు ఎవరూ భయపడవలసిన అవసరం లేదని నర్సీపట్నం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ ఖాతాదారులకు తెలియజేశారు.

కారు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

ఎంవీపీకాలనీ: కారు దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ద్వారకా క్రైం ఏసీపీ లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. ఈ నెల 13న లాసన్స్ బే కాలనీకి చెందిన తిరుమలరాజు సమతారాజు (34) ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి పార్కింగ్‌లో కారు లేదు. పోలీసులు ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలను పరిశీలించి దొంగతనానికి పాల్పడింది పాత నేరస్తుడు వాసుపల్లి ఎల్లాజీగా గుర్తించారు. గురువారం ఎంవీపీ సెక్టార్–11లో అరెస్ట్ చేశారు. అతని నుంచి కారుతో పాటు మరో ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అయ్యో.. రొయ్య!

- రొయ్యల ధర తగ్గింపుతో ఆందోళనలో మత్స్యకారులు
- గిట్టుబాటు కావడం లేదంటున్న గంగపుత్రులు
- ధరలు పెంచాలని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్





మహారాణిపేట: అలల మీద ఆశలతో.. ప్రాణాలను పణంగా పెట్టి రోజుల తరబడి సముద్రంలో వేటాడితే.. తీరానికి చేరాక వారి కష్టానికి దక్కేది కన్నీళ్లే. విశాఖ మత్స్యకారుల బతుకులు ప్రస్తుతం ఇలాగే మారాయి. ముఖ్యంగా రొయ్యల వేటపై ఆధారపడిన మత్స్యకార కుటుంబాలు.. ఎగుమతిదారులు, మధ్యవర్తులు కలిసి ఆడుతున్న ధరల నాటకంలో నలిగిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాక.. చేసిన అప్పులు తీర్చలేక సముద్రమంత శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతోందని గంగపుత్రులు గగ్గోలు పెడుతున్నారు.

ఎగుమతిదారుల ఏకపక్ష వైఖరి

ఒకప్పుడు విశాఖ కేంద్రంగా 8 మంది ఎగుమతిదారులు రొయ్యలు కొనుగోలు చేసేవారు. దీంతో పోటీ ఉండి, మత్స్యకారులకు మంచి ధర లభించేది. కానీ ఇప్పుడు ఆ సంఖ్య కేవలం మూడుకు పడిపోయింది. ఈ ముగ్గురూ సిండికేట్‌గా మారి ధరలను శాసిస్తున్నారని, వారికి తోడు మధ్యవర్తులు కూడా తమ కమీషన్ల కోసం మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'సముద్రంలో దొరికే నాణ్యమైన రొయ్యల కన్నా.. ఆక్వా కల్చర్ రొయ్యలకే ఎగుమతిదారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొన్నిసార్లు మేము తెచ్చిన రొయ్యలను కొనడానికి కూడా ఇష్టపడటం లేదు. దీంతో తెచ్చిన సరుకు అమ్ముడుపోక, అప్పుల పాలవుతున్నాం' అని ఓ మరపడవ యజమాని తన ఆవేదన వ్యక్తం చేశాడు. మధ్యవర్తులు అవసరానికి అప్పులిచ్చి, ఆ తర్వాత ధర నిర్ణయంలో చక్రం తిప్పుతూ జాలర్లను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వమే ఆదుకోవాలి

విశాఖ జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. జిల్లాలో మొత్తం 2547 అన్ని రకాల బోట్లు ఉన్నాయి. సుమారు 1.15 లక్షల మత్స్యకార కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఫిషింగ్ హార్బర్‌లో నెలకొన్న తాజా పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి. మత్స్యశాఖ అధికారులు చొరవ తీసుకుని, ఎగుమతిదారులు, మరపడవల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలి. సముద్రంలో వేటాడి తెచ్చిన రొయ్యలను ఎగుమతిదారులు తప్పనిసరిగా కొనుగోలు చేసేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. లేకపోతే తమ బతుకులు సముద్రంలో కలిసిపోవడం ఖాయమని ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడి భారమాయే..

గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రొయ్యల ధరలను ఎగుమతిదారులు భారీగా తగ్గించేశారు. ఇది మత్స్యకారుల నడ్డి విరుస్తోంది. బోటుకు డీజిల్, కళాసీల జీతాలు, వలల మరమ్మతులు, ఐస్, రేషన్ ఖర్చులు తడిసి మోపెడవుతుంటే.. తీరా అమ్మకానికి వచ్చేసరికి ధరలు పాతాళంలోకి పడిపోయాయని వారు వాపోతున్నారు.

ధరల పతనంతో తీరని నష్టం

రొయ్య రకం	గత ఏడాది ధర	ప్రస్తుత ధర	నష్టం
బ్రౌన్ రొయ్య	420	300	120
వైట్ రొయ్య	550	400	150
ఫ్లవర్ రొయ్య	550	500	50
టైగర్ రొయ్య	1200	1150	50

పట్టికలో చూస్తేనే అర్థమవుతోంది నష్టం ఏ స్థాయిలో ఉందో.! ముఖ్యంగా ఎక్కువగా దొరికే బ్రౌన్ రొయ్యపై ఏకంగా రూ.120 తగ్గించడం దారుణమని, కనీసం కిలోకు రూ.400 అయినా ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. కానీ.. వారి మాట వినే నాథుడే కరువయ్యాడు.

రొయ్యల ధరలు గిట్టుబాటు కావడం లేదు

రొయ్యల ధరలు గిట్టుబాటు కాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రస్తుతం 3 నుంచి 5 మంది ఎగుమతిదారులు మాత్రమే రొయ్యలను కొనుగోలు చేస్తుండటంతో మాకు సరైన ధర లభించడం లేదు. పైగా ఈ ఏడాది రొయ్యల ధరలు దారుణంగా పడిపోయాయి. గత ఏడాది ఇచ్చిన ధరల కంటే ఇప్పుడు మరింత తగ్గిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ఎక్కువ మంది ఎగుమతిదారులు రొయ్యలను కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలి.

– వీసీ అప్పారావు, గౌరవ అధ్యక్షులు
ఎపి మరపడవల సంఘం

స్టోరేజ్ సదుపాయం కల్పించాలి

రొయ్యలకు తగినంత నిల్వ సదుపాయం లేకపోవడం వల్ల నష్టపోతున్నాం. దీంతో ఎగుమతిదారులు తమకు నచ్చిన ధరలు నిర్ణయిస్తున్నారు. ఒక్కోసారి వేటాడి తెచ్చిన రొయ్యలను కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారు. ఆక్వా కల్చర్ రొయ్యల కొనుగోలుపై చూపిస్తున్న శ్రద్ధ సముద్రం నుంచి వేటాడి తెచ్చిన రొయ్యలపై చూపించడం లేదు. సముద్రపు రొయ్యలకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ, ఎగుమతిదారులు సహకరించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రొయ్యలకు తగినంత స్టోరేజ్ సదుపాయాలను కల్పించాలి.

– సూరాడ సత్యనారాయణ(సత్తిబాబు),
మత్స్యకారుడు

క్లుప్తంగా

తుమ్మపాలలో పారిశుధ్య పనులు



పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్న పంచాయతీ అధికారులు

తుమ్మపాల: మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పంచాయతీ అధికారులు చొరవతో పారిశుధ్య పనులను చేపట్టి వీధులను పరిశుభ్రం చేశారు. గ్రామంలో అపరిశుభ్రత, విష జ్వరాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ ఈవో వి.ఈశ్వరరావు తెలిపారు. తుమ్మపాల సంత పరిసరాలతో పాటు అన్ని వీధుల్లోను పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. పారిశుధ్య సిబ్బందితో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి పర్యటించి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన చేస్తున్నామన్నారు. డ్రై డేపై ప్రజల్లో పూర్తి అవగాహన చేస్తున్నామని, ప్రధాన కూడళ్లలో చెత్త లేకుండా దుకాణదారుల సహకరించాలని కోరారు.

కశింకోట తహసీల్దార్‌గా తిరుమలరావు



తహసీల్దార్ తిరుమలరావుకు శుభాకాంక్షలు చెబుతున్న రెవెన్యూ సిబ్బంది

కశింకోట: స్థానిక తహసీల్దార్‌గా సిహెచ్. తిరుమలరావు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన జి.సత్యనారాయణను అచ్యుతాపురం బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన తిరుమలరావును హెచ్‌డీటీ బి.వి. రామకృష్ణ, ఆర్ఐ రమేష్, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది దుశ్శాలువా కప్పి, మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: మండలంలో కొత్తూరు విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత తీగలు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ కశింకోట డివిజన్ ఏఈ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు, పిసినికాడ పంచాయతీ పరిధిలో విద్యుత్‌ను నిలుపుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

20న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

అనకాపల్లి: తుమ్మపాల వాకర్స్ క్లబ్, విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో తుమ్మపాలలోని పోలిపిల్లమ్మ తల్లి ఆలయ సమీపంలో ఈ నెల 20న ఉదయం 8 గంటలకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఎరుబండి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి, ఆపరేషన్లకు ఎంపికైన రోగులను విశాఖ ఆస్పత్రికి తీసుకుని వెళ్లి ఉచితంగా చేసి పంపిస్తారని పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 32 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	---	---
మూడోరకం	3,000	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా	: మై బేబీ
సత్యనారాయణ స్క్రీన్-1	: జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	: కన్నప్ప
పర్తిసాయి	: ఓ భామ అయ్యో
రామ షిర్డీసాయి	: కొత్తపల్లిలో ఒకప్పుడు
వెంకటేశ్వర	: మిస్టర్ రెడ్డి
శ్రీ సత్య	: ఏమాయ చేసావె
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్తనిల్వ ఉంది. ఏ పాజిటివ్-19, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-31, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 353 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 303 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

మోసగాడు, వేషగాడు

- బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ నినాదంతో త్వరలో ఇంటింటి ప్రచారం
- సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే వరకూ ప్రజల పక్షాన పోరాటాలు
- వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్, దంతులూరి దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు, పెదిశెట్టి గోవింద్

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఒక మోసగాడు(చంద్రబాబు), ఒక వేషగాడు(పవన్ కల్యాణ్) కలిసి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఇంటింటికీ బాండ్లు పంపిణీ చేసి, అధికారంలో వచ్చి ఏడాదైనా వాటి ఊసెత్తలేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో ఐదు కోట్ల ప్రజలను మోసం చేయడానికే సీఎం చంద్రబాబు 40 సంవత్సరాలు రాజకీయ చరిత్ర ఉపయోగపడిందని ఎద్దేవా చేశారు. మండలంలో తుమ్మపాల గ్రామం బంగారురాజు కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' అనే నినాదంతో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం ఆ పార్టీ మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. తొలుత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్‌తో కలిసి భరత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నాయకులను నమ్మకపోవడంతో ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు సంక్షేమ పథకాలు ద్వారా అందజేస్తామని ఇంటింటికీ తిరిగి బాండ్లు రాసిచ్చిన రోజులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేస్తామని అధికారం చేపట్టిన తర్వాత అనేక షరతులు విధించడం దారుణమన్నారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ చేయడం వల్లే కూటమి అధికారం చేపట్టిందని ట్విట్టర్ పోస్టులతో దేశవ్యాప్తంగా చర్చ నడుస్తుందన్నారు. రెండు, మూడు రోజుల్లో పార్టీ మండల కమిటీలు, వారం రోజుల్లో గ్రామ కమిటీలు నియమిస్తామన్నారు. త్వరలో గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అనే నినాదంతో గడప గడపకు పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తారన్నారు.

రోడ్డు నిర్మించకుండా వ్యక్తిగత విమర్శలా...

రెండు రోజులు క్రితం అనకాపల్లిలో పెరుగు బజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకూ రహదారి నిర్మించాలని పార్టీ ఆధ్వర్యంలో పర్యటిస్తే, కూటమి నేతలు వ్యక్తిగత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని భరత్‌కుమార్ అన్నారు. రాజకీయ జీవితంలో మంచి పేరు ప్రతిష్టలు పొందిన ఎమ్మెల్యేకు చెడ్డపేరు తీసుకువచ్చే విధంగా ప్రవర్తించడం మానుకోవాలని హితవు పలికారు. జీవీఎంసీ మేయర్ ఎన్నికల్లో 80, 81 వార్డు కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీని విడిచి వెళ్లిపోయారన్నారు. ఇప్పుడు ఆయా వార్డుల్లో కొత్తగా వేసి విద్యుత్ లైట్లు ప్రారంభానికి వారిని పిలవని పరిస్థితి ఏర్పడిందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకు అతీతంగా డీబీటీ పద్ధతి ద్వారా 2 లక్ష 75 వేల కోట్లు రూపాయలు అందజేశామన్నారు. గత ప్రభుత్వం అమ్మఒడి పథకంలో రూ.15 వేలలో వెయ్యి రూపాయలు పాఠశాల అభివృద్ధికి తీసుకుందన్నారు. ఇప్పటి ప్రభుత్వం ఆ పథకాన్ని తల్లికి వందనంగా పేరు మార్చి రూ.2 వేలు తీసుకుని ఏమి చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 2029 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందని, జగన్ 2.0లో మంచి జరుగుతుందన్నారు.

మండల పరిషత్ నిధులు పక్కదారి..

ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతుందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కూటమి పాలనలో మండల పరిషత్ నిధులు అమరావతి అభివృద్ధికి తరలిస్తున్నారని విమర్శించారు. ఈ నిధులు పక్కదోవ పట్టడం వల్ల గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేకుండా ఉన్నాయన్నారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే వరకూ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు.



వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు



జనసేన పార్టీ నాయకుడు కోటిపల్లి నాయుడుకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న భరత్‌కుమార్

వైఎస్సార్‌సీపీలో జనసేన నాయకుడు చేరిక

జనసేన పార్టీపై విరక్తి చెందిన ఆ పార్టీ మార్టూరుకు చెందిన నాయకుడు కరణం కోటిపల్లి నాయుడు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈయనకు మలసాల భరత్‌కుమార్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం క్యూఆర్ కోడ్ స్కానర్‌ను పార్టీ శ్రేణులు ఆవిష్కరించాయి. ఎంపీపీ అయితా రాము, విల్లూరి చంద్రశేఖర్, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లెల సాయికిరణ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు బాదపు హరికృష్ణ, అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పీడీ గాంధీ, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కొట్నాల పద్మకుమారి, తుమ్మపాల ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వడ్డాది భారతి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, మేధావుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు కసుబుడ్డి శంకరరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, పార్టీ నాయకులు నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ విభాగాల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

థైలేరియా నివారణ టీకాలు తప్పనిసరి



టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రామ్మోహన్‌రావు

కశింకోట: సంకర జాతి పశువులకు థైలేరియా వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి బి. రామ్మోహన్‌రావు తెలిపారు. కశింకోటలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నెలలు వయస్సు దాటిన సంకర జాతి పశువులన్నింటికి ఈ టీకా వేయించాలన్నారు. గోమార్లు కుట్టడం వల్ల థైలేరియా వ్యాధి సోకుతుందన్నారు. దీనివల్ల జ్వర తీవ్రత, పాల దిగుబడి తగ్గిపోవడం, లింప్ గ్రంథులు వాచిపోవడం, రక్తహీనత కారణంగా పశువు చిక్కిపోవడం, చివరగా శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలతో పశువు బాధపడుతుందన్నారు. ఈ వ్యాధి సంకర జాతి, విదేశీ జాతి పశువులతో తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. దీనిదృష్ట్యా తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో కశింకోట పశు వైద్యాధికారి సిహెచ్. చైతన్యమణి, పశు సంవర్థక శాఖ సహాయకుడు బి. ఈశ్వరరావు, గోపాల మిత్ర మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

21 నుంచి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

అనకాపల్లి: కిడ్నీ సంబంధిత సమస్యలపై ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తుమ్మపాల, తగరంపూడి, కశింకోట పీహెచ్‌సీ వైద్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఉదయం 9 గంటలకు మండలంలో మార్టూరు, మామిడిపాలెం, ఊడేరు, సంపతిపురం గ్రామాల ప్రజలకు, 22న సీహెచ్ఎన్.అగ్రహారం, బవులవాడ, వేటజంగాలపాలెం గ్రామాల్లోను, 23న కుంచంగి, రొంగలివానిపాలెం, సుందర్యపేట గ్రామాల్లో ప్రజలకు ఉచితంగా సీరం క్రియేటివ్, హిమోగ్లోబిన్, బ్లడ్ సుగర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.





అప్పన్న చెంత.. పేదల పెళ్లి చింత!

- ➡ సింహాచలంలో పెళ్లిళ్లకు దేవస్థానం సత్రాలు కరవు
- ➡ పుష్కరిణి సత్రం తొలగింపు.. సేవలు నిలిపేసిన టీటీడీ సత్రం
- ➡ శ్రీదేవి కాంప్లెక్స్ కల్యాణ మండపాలు వేరే వాటికి కేటాయింపు
- ➡ దేవస్థానం కార్యాలయంగా విజయరామరాజు కల్యాణమండపం
- ➡ ప్రైవేట్ మండపాలను ఆశ్రయించి చేతి చమురు వదిలించుకుంటున్న పేదలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వెలసిన సింహాచలంలో తమ పిల్లలకు పెళ్లిళ్లు చేయాలని పలువురు మొక్కుకుంటుంటారు. స్వామిని తమ ఇలవేల్పుగా కొలిచే ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారు తమ పిల్లలకు ఎక్కువగా సింహాచలంలో పెళ్లి జరిపిస్తుంటారు. వీరిలో చాలామంది పేదలు, మధ్యతరగతివారే. వీరి కోసం కొండ దిగువ పుష్కరిణి సత్రం, టీటీడీ సత్రం, గోదా కల్యాణమండపం, విజయరామరాజు కల్యాణమండపం అందుబాటులో ఉండేవి. అవన్నీ ఇప్పుడు గత చరిత్రగా మారాయి.

> పేద, మధ్యతరగతి వాళ్లు పెళ్లి చేసుకునేందుకు సింహాచలం కొండ దిగువ దేవస్థానం కల్యాణమండపాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు కల్యాణమండపాలకు అధిక ధరలు చెల్లించలేక సతమతమవుతున్నారు. పదేళ్ల కిందటి వరకు కొండదిగువ పేద, మధ్యతరగతి వాళ్లకు అనుకూలంగా ఉన్న దేవస్థానం కల్యాణ మండపాలు కనుమరుగవడమే ఇందుకు కారణం.

అందుబాటులో లేని శ్రీదేవి కాంప్లెక్స్



విద్యార్థుల బసగా మారిన శ్రీదేవి కాంప్లెక్స్

పేదలకు ఉచితంగా కల్యాణమండపాలు అందుబాటులో ఉంచాలన్న దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు సంకల్పం మేరకు కొండదిగువ ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఏడేళ్ల క్రితం దేవస్థానం శ్రీదేవి కాంప్లెక్స్ నిర్మించింది. దిగువ భాగంలో షాపులు, పైభాగంలో నాలుగు కల్యాణమండపాలు ఏర్పాటు చేశారు. మండపాలను వివాహాలకు ఉచితంగానే ఇచ్చేందుకు నిర్ణయించారు. రెండేళ్ల పాటు బాగానే నడిచింది. ఆ తర్వాత దేవస్థానం నాద పాఠశాల హాస్టల్ విద్యార్థుల బసకు ఒక మండపం, సంస్కృతోన్నత పాఠశాల హాస్టల్‌గా ఇంకో మండపాన్ని కేటాయించారు. మిగిలిన రెండింటిని యాత్రికుల ఉచిత బసగా మార్చేశారు.

టీటీడీ సత్రాన్ని చూస్తే బాధేస్తుంది



పేద, మధ్య తరగతి ప్రజల వివాహాలకు టీటీడీ సత్రం ఎంతో అనువుగా ఉండేది. ఈ సత్రంలో ఎన్నో పెళ్లిళ్లు జరగడం నేను చూశా. పెళ్లి బృందానికి సరిపడా గదులు, విశాల ప్రాంగణం అతి తక్కువ ధరకే లభించేవి. ఇక్కడి మండపాల్లో ఇదే అతి పెద్దది. ప్రస్తుతం టీటీడీ సత్రం సేవలు నిలిచిపోవడం చాలా బాధగా ఉంది.

– మూర్తి, సింహాచలం

పేదల గురించి ఆలోచించాలి



అప్పన్న సన్నిధిలో తమ పిల్లల పెళ్లి చేయాలని మా జిల్లాలో చాలా మంది మొక్కుకుంటారు. అందరూ పెద్ద మొత్తంలో అద్దె చెల్లించి ప్రైవేట్ కల్యాణ మండపాలు తీసుకోలేని పరిస్థితి. అలాంటి వారి కోసం దేవస్థానం తక్కువ ధరలకే మండపాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మల్లేశ్వరరావు, శ్రీకాకుళం

నిలిచిన పుష్కరిణి సత్రం పనులు



పుష్కరిణి సత్రం స్థానంలో ప్రసాద్ స్కీమ్‌లో చేపట్టిన కల్యాణమండపం (ప్రస్తుతం నిలిచిన పనులు)

పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే పుష్కరిణి సత్రం కళకళలాడేది. రెండు అంతస్తుల్లో 40 గదులు ఉండేవి. మండపం ప్రాంగణంలో ఒకేసారి ఇరవై పెళ్లిళ్ల వరకు జరిగేవి. ఒక వివాహ బృందం ఒక మండపం వేసుకుంటే రెండు గదులు వారికి ఇచ్చేవారు. గది అద్దె రూ.100 మాత్రమే ఉండేది. సింహగిరి దివ్యక్షేత్రం పనుల్లో భాగంగా పదేళ్ల క్రిందట సింహగిరిపై ఉన్న గిరిజనులను, నిర్వాసితులకు పుష్కరిణి సత్రంలో తాత్కాలిక వసతి కల్పించారు. కొన్ని గదుల్లో దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థుల హాస్టల్ కిచెన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పుష్కరిణి సత్రం పెళ్లి వేడుకలకు దూరమైంది. రెండేళ్ల క్రితం ప్రసాద్ స్కీమ్ పనుల్లో భాగంగా దీన్ని పూర్తిగా తొలగించారు. దాని స్థానంలో చేపడుతున్న ఆధునిక సత్రం పనులు కూడా అర్ధంతరంగా నిలిచిపోయాయి.

టీటీడీ సత్రం సేవలకు సెలవు



నిరుపయోగంగా ఉన్న టీటీడీ సత్రం

కొండ దిగువన 1978లో టీటీడీపీ రెండు అంతస్తుల్లో(ఒక్కో దాంట్లో ఆరేసి గదులు) సత్రాన్ని నిర్మించి, దేవస్థానానికి అప్పగించింది. వివాహాలకు రెండు పెద్ద డయాస్‌లతో కూడిన విశాల ప్రాంగణం ఉంది. ఒక వేదిక, ఆరు గదులు బుక్ చేసుకుంటే సుమారు రూ.5 వేలతో అయిపోయేది. సింహాచలంలో పెళ్లి చేసుకోవాలంటే అది టీటీడీ సత్రంలోనే అన్నంత గొప్పగా ఉండేది. నిర్వహణ లోపంతో నాలుగేళ్ల నుంచి టీటీడీ సత్రం సేవలు నిలిచిపోయాయి. భవనం రంగులు వెలిసిపోయి, కొన్నిచోట్ల పెచ్చులూడుతూ మరమ్మతులకు గురైంది. ఇటీవల ఓ గదిని ఆధునీకరించి రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌కు కేటాయించారు. మిగిలిన వాటి మరమ్మతులపై దృష్టి సారించట్లేదు. విజయరామరాజు కల్యాణ మండపాన్ని దేవస్థానం కార్యాలయంగా మార్చేయడంతో అది కూడా పేదల పెళ్లిళ్లకు అందుబాటులో లేకుండా పోయింది.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



శ్రీనివాస హరిగోపాల్‌కు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సిరిపురానికి చెందిన శ్రీనివాస హరిగోపాల్ అనే దాత రూ.లక్ష విరాళమిచ్చారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు బాండ్ ఇచ్చారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల పర్యవేక్షణ



పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజతో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఎంపీడీవోలు

అనకాపల్లి టౌన్: గ్రామాల్లో మౌలిక వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని విశాఖపట్నం జెడ్పీ సీఈవో పి. నారాయణ మూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజతో ఇంటరాక్ట్ వాయిస్ రెస్పాన్స్ సర్వే ఆన్ శానిటేషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లాలోని 24 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం శానిటేషన్, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వీటిపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రతీ ఇంటి యజమానికి ఆయా గ్రామాల పరిస్థితిపై ఫోన్ చేసి అభిప్రాయాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

అనకాపల్లి టౌన్: పట్టణంలోని టౌన్ గరల్స్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యాతా లోపంగా ఉందని అనకాపల్లి ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. స్థానిక టౌన్ గరల్స్ హైస్కూల్‌ను గురువారం వారు సందర్శించారు. ఇక్కడ మధ్యాహ్న భోజన పథకంలో పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 500 మందిపైగా విద్యార్థినులు చదువుతున్న పాఠశాలలో తక్షణమే నాణ్యతతో కూడిన భోజనాన్ని అందివ్వాలన్నారు. ప్రజా సంఘాల నేతలు బొడ్డేడ అప్పారావు, చిన్ని యాదవ్, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.